

ట్రిపుల్ఐటీ ప్రవేశ పత్రం అందుకుంటున్న విద్యార్థిని

# ముగిసిన రెండో విడుత కౌన్సెలింగ్

బాసర, జూలై 19 : బాసర ట్రిపుల్ఐటీలో ఆరేండ్ల ప్రవేశానికి గాను ఇటీవల 1,404 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. మొదటి విడుత కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన 148 సీట్లకు బుధవారం మరోసారి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించినట్లు డైరెక్టర్ సతీశ్‌కుమార్ తెలిపారు. ఇందులో 130 మంది హాజరు కాగా, 18 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

# గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తు చేసుకోండి

నిర్మల్ అర్బన్, జూలై 19 : నిర్మల్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 52 మంది గెస్ట్ లెక్చరర్ల నియామకం కోసం ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్మల్ జిల్లా నోడల్ అధికారి పరశురాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో 31, ఉర్దూ మీడియంలో 18, మరాఠీ మీడియంలో 7, ఒకేషనల్‌లో రెండు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులకు పది, ఇంటర్, డిగ్రీ, పీజీ జిరాక్స్ సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారి సంతకం, బయోడేటా ఫారంతో ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

**ఆదిలాబాద్ డిగ్రీ కళాశాలలో..**

ఆదిలాబాద్ రూరల్, జూలై 19 : ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్సెస్)లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్‌లో 2, తెలుగులో 1, ఉర్దూలో 1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్‌లో 1, జంతుశాస్త్రం (ఉర్దూ మాధ్యమం)లో 1 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత పీజీ సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉన్నా అర్హులేనని తెలిపారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రం అందజేస్తే వెయిటేజీ ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 23వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ఈ నెల 24న ఉదయం 10 గంటల నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్సెస్), ఆదిలాబాద్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

# నిర్మల్ వాసికి డాక్టరేట్



కట్కం మురళి

నిర్మల్ అర్బన్, జూలై 19 : భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న నిర్మల్‌కు చెందిన కట్కం మురళికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కోటలు, గడీలు' అంశంపై డాక్టర్ ఇందిరా పర్యవేక్షణలో పరిశోధనను పూర్తి చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని 70 కోటలు, గడీలు, భైంసాలో 1021 ఏళ్ల నాటి జైన శాసనశిల్పాలు, క్రీ.శ. 3వ శాసనం నాటి బౌద్ధ విగ్రహం, నిర్మల్‌లోని సర్దిమహల్‌లో ఉన్న ఇబ్రహీం దంపా సమాధి శాసనాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. జిల్లాలోని గోండుల చరిత్ర, నిర్మల్ కోటల లక్షణాలు, గడీల నిర్మాణం, ఇనుప పరిశ్రమల కేంద్రాలను ఈయన పరిశోధనలో వివరించారు. డాక్టరేట్ గ్రహీతను ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ బీ లావణ్య, ఇందిరా, అర్జున్ రావ్, భైంసా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, అధ్యాపకులు, మిత్రులు అభినందించారు.

# బెటాలియన్ కమాండెంట్‌కు ఆత్మీయ వీడ్కోలు

ఆదిలాబాద్ రూరల్, జూలై 19 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ రెండో బెటాలియన్ నుంచి బదిలీపై వెళ్తున్న కమాండెంట్ ఆర్.వేణుగోపాల్‌ను బెటాలియన్ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి శాలువాతో ఆత్మీయ సత్కారం చేశారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్ అప్పరాయ్, కేవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.



కమాండెంట్ ఆర్ వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న బెటాలియన్ సిబ్బంది

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ




మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం,జూలై19: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించి సమగ్ర ఓటరు జాబితా తయారీకి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనపై బుధవారం బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. 1, అక్టోబర్ 2023 నాటికి 18 యేండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సవరించాలని, మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీశ్, నాయబ్ తహసీల్దార్లు సాయి మహేశ్, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

**బీఎల్‌వోలకు పూర్తి అవగాహన కల్పించాలి**

సమగ్ర ఓటరు జాబితాపై బూత్ లెవల్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తహసీల్దార్లను ఆదేశించారు. ఓటరు జాబితా రూపకల్పనలో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా, సమగ్రంగా ఓటరుజాబితా రూపొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించే బీఎల్‌వోలకు ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ ఎన్ నటరాజ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు నలంద ప్రియ, రాజేశ్వర్, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- బాగా పని చేసిన వైద్యసిబ్బందికి నగదు బహుమతి • ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్



మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఎదులాపురం, జూలై 19 : వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, వైద్యసిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. మెడికల్ ఆఫీసర్లు తమ పరిధిలో కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. అనుకున్న లక్ష్యాలను పూర్తి చేసి వైద్యులు, వైద్యసిబ్బందికి నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను కలెక్టర్ రాహుల్ రాజ్ ద్వారా అందిస్తామని తెలిపారు. ఇందుకు ముఖ్యంగా సీజన్‌లో ప్రబలే వ్యాధుల నివారణకు గ్రామ, మండల స్థాయిలో కచ్చితంగా డ్రైడే నిర్వహించాలన్నారు. మురుగు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వైద్యసిబ్బంది ప్రతిరోజూ చేస్తున్న ఫీల్డ్ విజిట్ వాట్సాప్ గ్రూప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వరదలతో రాకపోకలకు అంతరాయం ఉన్న గ్రామాల్లోని గర్భిణులను ముందుగానే పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు తరలించాలని సూచించారు. అనంతరం డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ అతుల్ పవర్ పాయింట్ ద్వారా వివిధ అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ సమావేశంలో డీఐవో వైసీ శ్రీనివాస్, డీఎంవో మెటిపెల్లివార్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి
- జిల్లాకు కొత్తగా వచ్చిన 15 మంది ఎస్‌ఐలు



ఎస్పీ ఉదయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌ఐలు

ఎదులాపురం,జూలై 19 : ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉన్నతమైన సేవలు అందించాలని ఆదిలాబాద్ ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించబడిన 26 మంది ఎస్‌ఐలలో 15 మంది బుధవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరంతా నిజామాబాద్ కమిషనరేట్ నుంచి ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించబడ్డారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా మారుమూల ఆదివాసీ ప్రజల్లో వివిధ రకాల భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు ఉంటాయన్నారు. తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్లలో ప్రజలతో సంబంధాలు పెంచుకొని అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని తెలిపారు. యువత ఉన్నత భవిష్యత్‌కు సమాజంలో ప్రస్తుతం అనుసరిస్తున్న సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. బీ రాము, జీ నరేశ్, బీ నవీన్, పీ సంజీవరావు, సిరిగిరి సాయన్న, అనంతసాగర్, ఎండీ రహమతుల్లా, డీ దేవ్ కుమార్, బీ శివరాం, బీ పుష్పావతి, టీ గోవింద్, ఎస్ సంతోష్ రెడ్డి, సుంకరి సాయన్న, వీ ఉదయ్ కుమార్, హబీబ్ ఖాన్ జిల్లాకు కేటాయించగా, వీరికి త్వరలో పోస్టింగ్‌లు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ అన్వర్ ఉల్ హక్, సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ చైన్‌గేట్, జూలై 19: నిర్మల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ కింద డైస్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న పెడియాట్రీషన్(1), సైకాలజిస్ట్(1) పోస్టులు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు nirmal.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 24 లోపు జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.